జీహెచ్ఎంసీ ప్రజావాణికి స్పందన కరువు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో ఫిర్యాదులు అందడం లేదు. ప్రతి సోమవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వయంగా జోనల్ కమిషనర్ ఈ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటున్నప్పటికీ చాలా వరకు ఫిర్యాదుదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదు. దీనికి సాంకేతికపరమైన పలు కారణాలున్నాయని చెబుతున్నప్పటికీ స్వయంగా ఉన్నతాధికారులే సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నా.. ఫిర్యాదుదారులు ముందుకు రావడం లేదు.

కేవలం రెండే రెండు ఫిర్యాదులు..

నర్కిపూల్ బాగ్‌లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కేవలం రెండే రెండు ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో పాటు చాంద్రాయణగుట్ట సర్కిల్–8 డిప్యూటీ కమిషనర్ సురేందర్, యూడీసీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యాంకుమార్, ఎలక్ట్రికల్ విభాగం ఈఈ రామారావు తదితరులు పాల్గొన్నప్పటికీ అక్రమ నిర్మాణంపై ఒక ఫిర్యాదు రాగా.. ఆస్తి పన్ను సమస్యపై మరో ఫిర్యాదు అందింది.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ

దబీర్‌పురా: భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ అన్నారు. 75వ వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఆయన ఇమ్లిబన్ పార్కులో మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇళ్లల్లో, పరిసరాల్లో మొక్కలను నాటి వాటి పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సరిత, సర్కిల్–8, 9 మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సంతాప దినాలు ప్రారంభం

దబీర్‌పురా: దబీర్‌పురాలోని బీబీకా అలావాలో మొహర్రం సంతాప దినాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీబీకా అలావాలోని ఆలంలను దర్శించుకునేందుకు స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం దబీర్‌పురా బీబీకా అలావాలో ఏర్పాట్లపై అలావా ముతవల్లీని మీర్‌చౌక్ ఏసీపీ అడిగి తెలుసుకున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మీర్‌చౌక్ ఏసీపీ తదితరులు

జియాగూడ ఆర్యవైశ్య యువజన సంఘం ఏర్పాటు


యువజన సంఘం ప్రతినిధులతో మాడిశెట్టి సదానందం గుప్తా

జియాగూడ: సంఘం అభివృద్ధితో పాటు సమాజ సేవా కార్యక్రమాలను కూడా చేపట్టాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా అన్నారు. ఆదివారం రాత్రి జియాగూడలోని మున్సిపల్ క్వార్టర్స్ 2బీహెచ్‌కే కాలనీలో గల జియాగూడ ఆర్యవైశ్య సంఘంలో నూతనంగా జియాగూడ ఆర్యవైశ్య యువజన సంఘం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా కంకోల్ జగదీష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా రంగ విజయలింగం గుప్తా, కోశాధికారిగా నీల నరేష్ గుప్తా నియమితులయ్యారు. వీరితో పురానాపూల్ కార్వాన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా సురేష్ గుప్తా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐవీపీ యాద శ్రీనివాస్‌గుప్తా, పొమ్మయ్యగారి శ్రీకాంత్, గార్లపాటి రాజు, తొడ్పునూరి బాల్‌రాజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ విధానాల వల్లే పార్టీకి ఆదరణ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పాటిస్తున్న విధానాల వల్లే పార్టీకి ఆదరణ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు అందుబాటులో ఉండడమే కాకుండా వారికి ఇచ్చిన హామీలను పూర్తి చేస్తున్నామన్నారు. తాను ప్రత్యేకంగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు క్రమం తప్పకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు పంపి పనులను పూర్తి చేయిస్తున్నానన్నారు. ప్రస్తుతం నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో వరద నీటి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఈ విషయంపై తాను బల్దియా కమిషనర్ దృష్టికి తెచ్చి వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరానన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, నాయకులు ఆలీముద్దీన్, అబీబ్‌చౌస్ తదితరులున్నారు.


మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

మత్స్యశాఖ అభివృద్ధికి కృషి


సాయికుమార్‌ను సన్మానిస్తున్న జియాగూడ కాంగ్రెస్ ప్రతినిధులు

జియాగూడ: మత్స్యశాఖ అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ కో ఆపరేటీవ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సోమవారం సాయికుమార్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జియాగూడ కాంగ్రెస్ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ ముదిరాజ్, సహ కార్యదర్శి మహేష్ బాబు ఆయనను సన్మానించారు.

నియామకం


ఆనంద్ గుప్తా

దూద్‌బౌలి: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని దూద్‌బౌలిలోని పైనీర్ ముత్యాలమ్మ ఆలయంలో భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ దోరేటి ఆనంద్ గుప్తా తెలిపారు. ఈసారి ఉత్సవాల కోసం ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని దోరేటి ఆనంద్ గుప్తా తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా వెంకటాచలం ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసా చారి, భరతాచారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రమెద్ కుమార్, కోశాధికారిగా సంతోష్ గుప్తా, ముఖ్య సలహాదారులుగా బాలకిషన్ ముదిరాజ్, వరకాల యాదగిరి తదితరులు నియమితులయ్యారని ఆనంద్ గుప్తా తెలిపారు.

జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ రాష్ట్ర రెవెన్యూ మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్వాన్ నియోజకవర్గంలో పేద బడుగు వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్నారని వీరి పిల్లల చదువుల కోసం నియోజకవర్గంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల లేదని అన్నారు. దీంతో పదవ తరగతి పూర్తి చేసిన పేద విద్యార్థులు ఇంటర్ చదవలేకుండాపోతున్నారని ప్రైవేటు కళాశాలల్లో చదివించే ఆర్థిక స్తోమత లేదని అన్నారు. గోల్కొండలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విజయవంతంగా కొనసాగుతుందని వందలాది మంది పేద కుటుంబాలకు చెందిన బాలికలు అక్కడ చదువుకుంటున్నారని ఆయన మంత్రి దృష్టికి తెచ్చారు. హకీంపేట్‌లో ప్రభుత్వ స్థలం ఉందని జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆయన కోరారు. చదువు లేకపోవడం వల్లనే కార్వాన్ యువత కూలీలుగా మారుతున్నారని వివరించారు. జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే పేద కుటుంబాల పిల్లలకు మేలు కలుగుతుందన్నారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మహానేతకు ఘన నివాళి

ఘనంగా వైఎస్సార్ జయంతి


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆచార్య పెదారపు చెన్నారెడ్డి


రోగులకు పండ్లు అందజేస్తున్న కాంగ్రెస్ జియాగూడ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లే


నివాళులర్పిస్తున్న మనిలాల్ షా తదితరులు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, నిర్మల్‌కుమార్ యాదవ్

నాంపల్లి: దివంగత మహానేత వైఎస్సార్ మేలును మరువలేనని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ సంచాలకులు, దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు ఆచార్య పెదారపు చెన్నారెడ్డి గుర్తు చేసుకున్నారు. సోమవారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన ఆచార్య పెదారపు చెన్నారెడ్డి ప్రసంగించారు. తెలుగునాట వైఎస్సార్ ఖ్యాతి చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. వైఎస్సార్ హయాంలో అంతటి అభివృద్ధిని చూశామని గుర్తుచేశారు. నేడు మన మధ్యన వైఎస్సార్ లేకున్నా ఆయన ప్రవేశపెట్టిన పథకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు.

వైఎస్సార్ సంక్షేమ పథకాలు చిరస్మరణీయం..

జియాగూడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయంగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లే అన్నారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను పురస్కరించుకుని పన్నిపురాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.శ్రీనివాస్, కావూరి వెంకటేష్, నర్మద, దుర్గాప్రసాద్, జగన్‌గౌడ్, సంతోష్ గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

అబిడ్స్‌లో..

అబిడ్స్: దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, ప్రేమలత అగర్వాల్ సురేందర్ యాదవ్ అశోక్ కుమార్, నర్సింగ్‌రాజ్, సురేశ్‌రాజ్‌లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాంధీభవన్‌లో..

వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్, ఫయుముద్దీన్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభు త్వ ఆధ్వర్యంలోని టాంకాం(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) సంస్థ జనరల్ మేనేజర్ కె. నాగభారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన ఆసుపత్రులలో నర్సింగ్, ఐసీ యూ, జేరియాట్రిక్స్, ఆర్థోపెడిక్, సైకియాట్రి, కార్డియాలజీ, నియోనాటల్, సర్జికల్ తదితర విభాగాల లో పని చేయుటకు ఆయా రంగంలో 1 నుంచి 3 సంవత్సరాల అనుభవంతో పాటు జర్మనీ భాష తెలి సి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 89190 47600, 99088 30438లలో లేదా వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.inలో సంప్రదించవచ్చు.

బారికేడ్లను వెంటనే తొలగించాలి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ అర్చకులు బొల్లు పవన్ కుమార్

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని కట్ట మైసమ్మ మహంకాళి మాత ఎల్లమ్మ ఆలయానికి అనుకొని ఉన్న స్థలంలో భక్తులకు అసౌకర్యంగా రైల్వే పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే తొలగించేలా చేపట్టాలని కోరుతూ సోమవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆలయ అర్చకులు బొల్లు పవన్ కుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి సమర్పించారు.

వాణిజ్య పన్నుల శాఖలో డ్రైవర్ల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో వివిధ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక డ్రైవర్ల జీతాలు కొన్ని నెలలుగా చెల్లించకపోవడంపై డ్రైవర్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగానే గత ఏడాది కాలంగా నెల జీతాలు సక్రమంగా చెల్లించడం లేదంటూ సోమవారం నాంపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆందోళనకు దిగారు. పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ..12 నెలలుగా తమకు జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలంటూ ప్రశ్నించారు. పాత బకాయిలను చెల్లించి ప్రతి నెల జీతాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లతో ఉన్నతాధికారులు చర్చలు జరిపి ఆందోళనను విరమింపజేశారు.

రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి


ప్రమాదానికి గురైన వాహనదారుడు

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని ఖాజీపురా ఆశా టాకీస్ సమీపంలో రోడ్డు మరమ్మతులు పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఈ దారిలో ప్రతిరోజు రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు గుంతలమయమైన రోడ్ల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. ఈ దారి గుండా ప్రతిరోజు బహదూర్‌పురా, హిమ్మత్‌పురా, ఫతేదర్వాజా తదితర ప్రాంతాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఇటీవల ఓ వాహనదారులు అదుపు తప్పి కిందపడిపోయి గాయాలకు గురయ్యాడు. ఇలాంటి ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని..వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

'బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం'

చార్మినార్: పాతబస్తీలో జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను ఈసారి గతంలో కన్నా మరింత ఘనంగా నిర్వహిస్తున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. సోమవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధులు మీరాలంమండి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ గౌడ్‌తో పాటు ప్రతినిధులు రాజేశ్, నోముల ప్రకాష్ యాదవ్, హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు

మహ్మద్ ఉస్సేన్‌ను వెంటనే విడుదల చేయాలి

సుల్తాన్‌బజార్: రచయిత, కార్మికనేత మహ్మద్ ఉస్సేన్‌ను పోలీసులు కిడ్నాప్ చేశారని తనను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పౌర హక్కుల సంఘం తెలంతాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడారు. సోమవారం ఉదయం 5 గంటలకు కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని మహ్మద్ ఉస్సేన్ నివాసంలో సివిల్‌డ్రెస్‌లో వచ్చిన పోలీసులు ఆయనను కిడ్నాప్ చేశారన్నారు. మహ్మద్ ఉస్సేన్ సుదీర్ఘ కాలం సింగరేణి కార్మిక సమైక్యలో ఎంతో కలంగా పనిచేశారని తెలిపారు. అనారోగ్య కారణంగా 15 ఏళ్లుగా జమ్మికుంటలోని తన స్వగృహంలో ప్రశాంతంగా జీవిస్తున్న అతనిని సోమవారం పోలీసులు ఎత్తుకెళ్లారని, అతని ప్రాణానికి హాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో హైదరాబాద్ సెల్ కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టర్లకు పాత బకాయిలు ఇప్పించండి


ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు పాత బకాయిలు ఇప్పించాలని కాంట్రాక్టర్ల జేఏసీ చైర్మన్, టీపీసీసీ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..రెండేళ్ల క్రితం అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏఎంఎస్ యాన్యువల్ మెయిన్‌టెనెన్స్ సిస్టంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డు పాలయ్యారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల పొట్ట కొట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టంను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్‌రాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ పరిధిలో ఆలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు పప్పు మాత్రే పేర్కొన్నారు. కాసిబుగ్గ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాబురావు, లడ్డు సింగ్, అనిల్, అర్జున్‌శాత్రే ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పప్పు మాత్రే మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేక పలు ఆలయాలు సమస్యల వలయాలుగా ఉన్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో బోనాల వేడుకల సందర్భంగా ఆలయ అభివృద్ధి చేపట్టాలని ఆయన అన్నారు.


బీఆర్ఎస్ నాయకుడు పప్పు మాత్రేను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ప్రజ సమస్యల పరిష్కారానికి బస్తీల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని జహంగీర్ నగర్, మురాద్ మహల్, అలీజా కోట్ల, రంగెలీ కిడికి, ఎత్తెబర్ చౌక్, బీబీ బజార్ చౌరస్తా ప్రాంతాల్లో కార్పొరేటర్, అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్వయం కృషితోనే మహిళల ఆర్థికాభివృద్ధి



గోల్కొండ: స్వయం కృషితోనే మహిళల ఆర్థికాభివృద్ధి చెందుతారని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీ అక్బర్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన మెహిదీపట్నంకు చెందిన పలువురు మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ మహిళలు స్వయం ఉపాధి కోసం తమకు అధికారుల నుంచి ఎటువంటి సహకారం అందడం లేదని అన్నారు. దీనిపై మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. ఒకరిద్దరు మహిళలు వ్యక్తిగతంగా కాకుండా మహిళలంతా ఒక గ్రూప్‌గా ఏర్పడాలన్నారు. ఈ విధంగా గ్రూప్‌గా ఏర్పడ్డ మహిళలు స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రతినిధి మహ్మద్ ఇస్మాయిల్ తదితరులున్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు


సినీనటి కరాటే కల్యాణిని సన్మానిస్తున్న దామోదర్ గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: బోనాల వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటితరం చిన్నారులకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసేలా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సినీ నటులు రాగిని, కరాటే కల్యాణి, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్నరాణి, సంస్థ వ్యవస్థాపకురాలు లలితరావు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో ప్రత్యేక పూజలు


అమ్మవారి ఆలయానికి తరలివెళ్తున్న భక్తులు

గోల్కొండ: గోల్కొండ కోటకు సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా మొదటి బోనానికి హాజరుకాని వారు సోమవారం పెద్ద సంఖ్యలో కోటకు తరలివచ్చారు. కాగా వచ్చిన వారు ముందుగా నగీనాబాగ్‌లోని నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించారు. అనంతరం నగీనాబ్యారెక్స్‌లో బోనం కుండలు తయారు చేసుకోని కోటపైకి తరలివెళ్లారు. సాంప్రదాయ దుస్తుల్లో పలువురు మహిళలు సిగసత్తులు వెంటరాగా ఎల్లమ్మతల్లి తమను చల్లగా చూడాలంటూ అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు.

'సముద్ర నానీలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య గోపీ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో యువ రచయిత కొక్కుల శివకృష్ణ రచించిన 'సముద్ర నానీలు'పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపీ మాట్లాడుతూ..యువ రచయితలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. పలు విషయాలను రచయిత అద్భుతంగా రాశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యులు సూర్య ధనుంజయ్, కవులు పోరెడ్డి రంగయ్య, కె.వంశీధర్, ఎస్.కృష్ణప్రసాద్, సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

తుల్జాపూర్‌లో ఘనంగా తెలంగాణ బోనాలు



చార్మినార్: తుల్జాపూర్‌లో తెలంగాణ ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు రెండు రోజుల పాటు జరిగాయి. డబీర్‌పురాలోని పంచ దుర్గ ఆలయానికి చెందిన బోనాల జాతర ఉత్సవాల కమిటీ ప్రతినిధులు తుల్జాపూర్‌లోని తుల్జాభవానీ అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించిన అనంతరం సోమవారం ఘటం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తుల్జాపూర్ నుంచి దత్తు తుల్జాపూర్ వరకు సామూహిక ఘటం ఊరేగింపు నిర్వహించారు. ఈ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో నిర్వాహకులు నక్క మహేందర్ గౌడ్, సత్తులాల్,ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, ఆనంద్‌లాల్ తదితరులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

తప్పిపోయిన బాలుడిని బంధువులకు అప్పగింత

నాంపల్లి: మదరస్సాలో ఆడుకుంటూ బయటకు వెళ్లిన ఓ ఐదేళ్ల బాలుడు తప్పిపోయాడు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం..హబీబ్‌నగర్‌లో నివాసం ఉండే దిల్‌షాద్ కుమారుడు హసన్(05) సుభాన్‌పురాలో ఉండే ఆలియా మసీదు మదరస్సాలో ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం మదరస్సా నుంచి ఆడుకుంటూ బయటకు వెళ్లాడు. వచ్చిన దారి మరిచి వేరే బస్తీకి చేరుకున్నారు. ఈ క్రమంలో తప్పిపోయిన హసన్ సోదరుడు ముస్తాఖాన్ తన తమ్ముడు కనిపించడం లేదంటూ హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సమీపంలోని దర్గాలు, మదరస్సాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వెతికారు. చివరకు సీసీ ఫుటేజీల ఆధారంగా తబందా హోటల్ వద్ద ఏడ్చుతూ కనిపించిన ఐదేళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాలుడిని బాధిత బంధువులకు అప్పగించారు.

సెట్విన్ శిక్షణ సంస్థ చైర్మన్‌గా గిరిధర్‌రెడ్డి

యాకుత్‌పురా: సెట్విన్ శిక్షణ సంస్థ చైర్మన్‌గా జహీరబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్.గిరిధర్ రెడ్డి నియమితులయ్యారు. మాజీ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ పదవీ కాలం పూర్తయిన అనంతరం గత ప్రభుత్వం ఎవరిని నియమించ లేదు. సోమవారం ప్రభుత్వ ప్రకటించిన 35 కార్పొరేషన్లతో పాటు సెట్విన్‌కు చైర్మన్‌ను నియమించింది. నూతన చైర్మన్ నియమకంపై పురానీహవేలీలోని సెట్విన్ సంస్థ ప్రధాన కార్యాలయం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.